
ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024
5
పార్వతీపురం మన్యం



ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - సీతంపేట

ఆన్లైన్ సేవలు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఆన్లైన్లో చేసుకోవచ్చని డిడి అన్న దొర తెలిపారు. https.//employment...ap.gov.in web సైట్ ద్వారా అన్ని జిల్లా ఉపాధి కార్యాలయాలు మోడల్ కెరీర్ సెంటర్, ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్‌లో ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవచ్చునని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్, డిగ్రీ ప్రొవిజనల్ మార్క్ షీట్, ఓటర్‌కార్డ్, కలర్ ఫోటో కుల ధ్రువీకరణ పత్రం తదితరు ఉండాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- తాగేందుకు పనికిరాని వైనం
- గోస్తనీ నది గర్భంలో రక్షణగోడ లేకపోవడమే కారణం
- సిఎం హామీ ఇచ్చినా మంజూరు కాని నిధులు
- విమానాశ్రయం కోసం చంపావతి నదిలో డైక్ ఏర్పాటుకు రూ.5.50 కోట్లు మంజూరు
- ప్రజల తాగునీటి సమస్య పట్టని అధికారులు

తాగునీటి బోర్లు ఉప్పునీటిగా మారిపోతున్నాయని, సముద్రం నుంచి ఉప్పునీరు వెనక్కి రాకుండా గోస్తనీ నదిలోని నది గర్భంలో డైక్ (రక్షణ గోడ) నిర్మించాలని గత కొన్నేళ్లుగా నదికి సమీపంలోని ప్రజలు అడుగుతున్నారు. కాని ఏ ప్రభుత్వాలు కూడా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రజల తాగునీటికి ఇబ్బందులు పడినా పర్వాలేదు కాని విమానాశ్రయానికి సరఫరా చేసే నీరు మాత్రం ఉప్పునీరుగా మారకూడదని చంపావతి నదిలో మాత్రం డైక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం విశేషం.



గుడివాడ సమీపంలో గోస్తనీ నదిలో డైక్ నిర్మించాల్సింది ఇక్కడే

బోర్ల నుంచి ఉప్పునీరు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని గుడివాడ పంచాయతీ పరిధిలోని మజ్జిపేట, గుడివాడ, ఎరుసుపేట గ్రామాలతో పాటు వివిధ గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే బోర్లు తగరపువలస సమీపంలోని గోస్తనీ నదిలో ఉన్నాయి. పై నుంచి వచ్చే వృథా నీరు గోస్తనీ నది ద్వారా సముద్రంలోకి కలుస్తుంది. అలాగే నాతవలస వద్దనున్న చంపావతి నది ద్వారా పై నుంచి వచ్చే వృథానీరు సముద్రంలోకి కలుస్తుంది. నదుల్లో నీరు ప్రవహించని సమయంలో నది భూగర్భంలో ఉన్న ఇసుక మేట్లు ద్వారా సముద్రం నుంచి ఉప్పునీరు వెనక్కి వచ్చేస్తుంది. అందుకు నదీ గర్భంలో సముద్రం నీరు ఇసుక మేట్లు ద్వారా వెనక్కి రాకుండా ఉండేందుకు అడ్డంగా రక్షన గోడ నిర్మించాలి. అది కూడా నది గర్భంలో ఇసుక మేట్లు దాటి మట్టి ఎక్కడ వస్తుందో అక్కడ నుంచి పైకి నిర్మించాల్సి ఉంటుంది. నదిలో ఈ డైక్ లేకపోవడంతో సమీప గ్రామాలకు చెందిన తాగునీరు బోర్లు ఉప్పునీరుగా మారిపోతున్నాయి. దీంతో గుడివాడ పంచాయతీకి చెందిన ప్రజలు గత 20 ఏళ్ళ నుంచి గుడివాడ సమీపంలో డైక్ నిర్మించాలని కోరుతున్నారు. కాని ఇప్పటికి ఏ ఒక్క ప్రభుత్వం స్పందించకపోవడం విశేషం.

విమానాశ్రయానికి నీటి కోసం నిధులు

విమానాశ్రయానికి తాగునీటి సరఫరా చేసేందుకు మాల నందిగాం వద్ద మొదటి విడత తాగునీటి సరఫరా కోసం రూ.28కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో డైక్ నిర్మాణానికి కూడా ఐదున్నర కోట్లు మంజూరు చేయడం విశేషం. ఆవాల నందిగాం సమీపంలో డైక్‌ను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. కాని గుడివాడ ప్రాంత వాసులు ఎన్నో ఏళ్ళ నుంచి అడుగుతున్నాసరే పట్టించుకోక పోవడం విశేషం. చాలా బోర్లు కూడా ఉప్పు నీరుగా మారిపోతుండడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి హామీల్లో భాగంగా నిధులు మంజూరు చేయాలని వీరంతా కోరుతున్నారు.

సిఎం హామీకి ఏడాది

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపనకు వచ్చినప్పుడు నాయకులు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఇందులో గుడివాడ వద్ద డైక్ నిర్మాణం కూడా ఉంది. దీనికి నిధులు మంజూరు చేస్తానని సిఎం కూడా హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఐదున్నర కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇది ప్రజలకు అత్యవసరమా కాదా అని మళ్లీ సిఎం కార్యాలయం నుంచి జిల్లాకు నివేదిక పంపించారు. ఈ మేరకు ఇక్కడ అధికారులు కూడా ఇది అవసరమేనని మళ్లీ నివేదిక ఇచ్చారు. ఇదంతా జరిగి ఇప్పటికి ఏడాది అవుతుంది కాని దీనికి సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.

ప్రతిపాదనలు పంపాం



గుడివాడ సమీపంలోని గోస్తనీ నదిలో డైక్ నిర్మాణానికి సిఎంఒ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు రావడంతో పంపించాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. కాని విమానాశ్రయానికి తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు మాల నందిగా వద్ద పనులు జరుగుతున్నాయి. ఇక్కడ బావులు ఉప్పునీరుగా మారకుండా ఉండేందుకు ఐదున్నర కోట్లతో డైక్ కూడా మంజూరయ్యింది.


- జమ్ము వైకుంఠం నాయుడు,
ఆర్‌డబ్ల్యుఎస్, డిఇ, భోగాపురం

మలేరియాతో బాలిక మృతి

డెన్సరాయిలో జ్వరాల విజృంభణ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని డెన్సరాయిలో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో అధిక సంఖ్యలో జ్వరపీడితులు బాధపడుతున్నారు. వేసవి ఎండలు తీవ్రంగా వుండడం, వర్షాలు పడుతుండడంతో గ్రామంలో మలేరియా విజృంభించింది. దీంతో గ్రామానికి మర్రి దివ్య అనే ఎనిమిదేళ్ళ గిరిజన బాలిక శుక్రవారం మృతి చెందింది. దివ్య మూడో తరగతి చదువుతోంది. మర్రి కాంగు కుమార్తె దివ్యకు జ్వరం రావడంతో ఆసుపత్రిలో కొద్దిరోజులు చికిత్స పొంది తీసుకెళ్లి పోయారు. కాంగు కుమారుడు విజయ్ కూడా మలేరియాతో బాధపడుతూ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ గ్రామ సర్పంచి పొట్టయ్య కుమారుడు కూడా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇలా ఇంటికొక జ్వరపీడితుడు వున్నట్లు తెలుస్తోంది. కలుషిత తాగునీటి వల్ల మలేరియా విజృంభించినట్టు గ్రామస్తులు భావిస్తున్నారు. వెంటనే వైద్యాధికారులు గ్రామం వైద్య శిబిరం నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



దివ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తం

కొమరాడ : జ్వరాలు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన జ్వరాలున్నాయన్న సమాచారం మేరకు అంటివలస గ్రామాన్ని శనివారం సందర్శించారు. అక్కడ నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వేలో నిర్ధారణ పరీక్షలను పరిశీలించగా ఇద్దరికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. అంతకు ముందు గుర్తించిన జ్వరపీడితుని ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఎమ్‌పిడిఒ మల్లికార్జునరావుతో కలిసి గ్రామంలో సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. దోమల సంభావ్యత గల ప్రాంతాలు ఉన్నాయేమోనని తనిఖీ చేసి నీటి నిల్వలు పరిశీలించారు. దోమలు నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గృహ సందర్శన చేసి జ్వారాలపై ఆరా తీసి వారి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. గ్రామంలో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచుతూ పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సేవలందించే విషయమై తక్షణమే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శామ్యూల్, ఏఎమ్‌ఓ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సిహెచ్‌ఒ బంగారు బాబు, వైద్య సిబ్బంది సురేష్, సరస్వతి, మాధురి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్వరపీడితులను పరీక్షిస్తున్న డిఎంఒ జగన్‌మోహనరావు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు ; ఇండిపెండెంట్ అభ్యర్థిని అదుపులో తీసుకుంటున్న పోలీసులు

విద్యార్థులపై స్వతంత్ర అభ్యర్థి దాడి

పోలీసుల అదుపులో అభ్యర్థి, అనుచరులు

ప్రజాశక్తి-రేగిడి

సంతకవిటి మండలం డోలపేట వద్ద రాజాం నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్ని రాజు, అతని అనుచరులు పెనుబాక గ్రామానికి చెందిన 7,9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బండి యశ్వంత్, శేఖర్ లపై దాడి చేసిన ఘటన సంచలనం రేపింది. రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం..

పెనుబాక గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు డోలపేట వచ్చారు. ఇండిపెండెంట్ అభ్యర్థి కార్యాలయానికి ముందు ఒక కారు ఉండడంతో ఆ కారు వద్ద వారిద్దరూ నిల్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో రాజాం నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్ని రాజు, తన ఇద్దరు అనుచరులతో కారు వద్దకు వచ్చి ఎందుకు ఇక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వీరిని దొంగతనం చేసిన వారిగా అనుమానించి కార్యాలయంలోనికి తీసుకువెళ్లి తలుపులు వేసి నిర్బంధించి తీవ్రంగా కొట్టారు. ఈ విషయమై స్థానికులు సంతకవిటి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావుకు సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడికి చేరారు.. అక్కడే ఉన్న విద్యార్థులను ప్రశ్నించగా తాము డోలపేట వచ్చామని, కారు దగ్గర నిల్చుని ఉన్నామని తెలిపారు.. ఇంతలోనే ఇండిపెండెంట్ అభ్యర్థి కార్యాలయానికి తీసుకువెళ్లి కొట్టారని వివరించారు. విద్యార్థులకు గాయాలవ్వడంతో రాజాం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు ఇండిపెండింట్ కార్యాలయానికి చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. అభ్యర్థి ఎన్నిరాజుతో పాటు అతని అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నో ఫ్లైజోన్‌గా కౌంటింగ్ కేంద్రం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్రలో గల ఉద్యాన కళాశాల పరిసరాలను "నో ఫ్లై జోన్"గా ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మానవ రహిత వైమానిక వాహనాలు (యుఎవి), డ్రోన్లు, బెలూన్లు మొదలైన వాటితో సహా ఎలాంటి విమానయాన పరికరాలను ఎగురవేయడం నిషేధించినట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అరకు (ఎస్టీ) పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో సహా పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ 4న కళాశాలలో ఏర్పాటు చేసిన సంబంధిత కౌంటింగ్ హాళ్లలో జరుగుతుందని చెప్పారు. 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 3 అంచెల భద్రతా ఏర్పాట్లు చేశామని, ముందుజాగ్రత్త చర్యగా, భద్రతా ఏర్పాట్లలో భాగంగా స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల భద్రత దృష్ట్యా ఉల్లిభద్రలో గల ఉద్యాన కళాశాల పరిసరాలను తదుపరి ఆదేశాలు వరకు "నో ఫ్లై జోన్" గా ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు

- కచ్చితంగా నిబంధనలు పాటించాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలవుతుందని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఈ ప్రక్రియ ఉదయం 8 గంటలకల్లా ఖచ్చితంగా ప్రారంభించాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకే లెక్కింపు కేంద్రాలవద్దకు చేరుకొని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలైన తరువాత, ఉదయం 8.30 గంటలకు ఈవిఎం ఓట్ల లెక్కింపును మొదలు పెట్టాలని చెప్పారు. ఓట్లను లెక్కించే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. లెక్కింపు ప్రక్రియలో వివిధ న్యాయపరమైన అంశాలు, సిబ్బంది విధులు, నిబంధనలు, కౌంటింగ్ హాళ్ళ, పోస్టల్ బ్యాలెట్లు, ఇవిఎం ఓట్లు లెక్కించే విధానం, టేబుళ్ల ఏర్పాటు, చెల్లని ఓట్లు, చెల్లినవి గుర్తించడం, వాటిని వేరు చేయడం, ఫలితాలను నింపడం, బోర్డుపై వెల్లడించడం, అవసరమైన పత్రాలను పూర్తి చేయడం, తిరిగి ఇవిఎంలను సీల్ చేయడం, స్ట్రాంగ్ రూములోకి తరలించడం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికలాధికారి నాగలక్ష్మి

ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా సొంత నిర్ణయాలను తీసుకోకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడు కేంద్రాలు, మొత్తం పార్లమెంటు స్థానం ఓట్ల లెక్కింపు కోసం లెండి కళాశాలలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్లమెంటు స్థానం పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం 20 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ సిబ్బంది గానీ, ఏజెంట్లు గానీ, ఇతర అధికారులు గానీ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఇవిఎంలలో ఓట్లను లెక్కించడానికి ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి ఒక కేంద్రం, ఆ నియోజకవర్గంలో పార్లమెంటుకు పోలైన ఓట్ల లెక్కింపు కోసం మరో లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్లు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుందని, అరగంట తరువాత ఈవిఎం ఓట్ల లెక్కింపు మొదలుపెట్టాలని ఆదేశించారు. మొదట విడతలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటును పరిశీలించాలని, అది పూర్తయ్యాక రెండో విడతలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలను పరిశీలించి, పార్టీల వారీగా వేరుచేసి, అనంతరం ఓట్లను లెక్కించాలని తెలిపారు. ఒక్కో రౌండ్‌కు ఒక టేబుల్‌కు 500 ఓట్లను కట్టకట్టి ఇవ్వడం జరుగుందన్నారు. ఇదే సమయంలో సర్వీసు ఓటర్లకు సంబంధించిన ఇటిపిబిఎంఎస్ ఓట్ల లెక్కింపు కూడా నిర్వహించాలన్నారు. ఎవరిని ఏ ఓట్ల లెక్కింపునకు కేటాయిస్తారో ముందుగా తెలియదని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం లోపల ఆర్‌ఓ వద్ద అభ్యర్థి లేదా జనరల్ ఏజెంట్ కు మాత్రమే కూర్చొనే అవకాశం ఉంటుందని, ఇతర ఏజెంట్లు, ప్రజాప్రతినిధులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. అన్ని లెక్కింపు కేంద్రాల్లో సిసి కెమేరాలు ఉంటాయని, వీడియో రికార్డింగ్ కూడా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ట్రైనింగ్స్ నోడల్ ఆఫీసర్ సుధాకరరావు, ఎలక్షన్ సెల్ సూపరింటిండెంట్ ప్రభాకరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కానరాని ఇంకుడు గుంతలు

పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు ● అడుగంటుతున్న నీటి వనరులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి నేపథ్యంలో నగరంలో జలఘంటికలు మోగుతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతున్నా తాగునీటి సమస్యను పరిష్కరించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. ప్రస్తుతం చాలా బోర్లు పనిచేయడం లేదు. నగరంలో సుమారుగా అన్ని ప్రాంతాల్లో ఈ ఇబ్బందులున్నాయి. 300 మీటర్ల పైబడి లోతు వరకు మోటార్లు దింపినా నీరందడం లేదు. మరోవైపు ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేసి భూగర్భ జలాన్ని పెంచుకోవాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్య ల్లేవు. వీటి ఏర్పాటు విషయంలో ప్రజలకు సరైన అవగాహన లేదు. గత ఐదేళ్ళుగా నుంచి వీటి నిర్మాణాల ఊసే లేదు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఇంకుడు గుంత

ఇంటి నిర్మాణం,అపార్ట్మెంట్లు నిర్మాణం కోసం దరఖాస్తు చేసినప్పుడే ఇంకుడు గుంతల కోసం నిర్దేశించిన రుసుమును చలానా రూపంగా చెల్లించాలి. నిబంధన ప్రకారం 200 చదరపుమీటర్లు దాటిన ప్రతి నిర్మాణానికి తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండాలి. అపార్టుమెంట్లు అయితే ప్రతి 10 యూనిట్లకు రెండు చొప్పున ఇంకుడు గుంతలు నిర్మించాలి. గతంలో ఒక్కో దాని కోసం నగరపాలక అధికారులు రూ.1200 తీసుకునే వారు. అనంతరం తనిఖీ చేసి వాటి నిర్మాణం చేపట్టేవారు. భవన యజమానులే కాకుండా సంస్థ సైతం కొన్నింటిని నిర్మించాల్సి ఉంది. ఈమేరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు చేపట్టాలి.

నిరుపయోగంగా నిధులు

మూడేళ్ల క్రితం పట్టణ ప్రణాళికా విభాగం సహకారంతో వివిధ ప్రాంతాల్లో 704 ఇంకుడు గుంతల్ని నిర్మించాలని భావించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధిత బాధ్యతలను అప్పగించారు. ఒక గుంతకు సుమారు రూ.10 వేలు అవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచారు. అప్పట్లో రూ.30 లక్షలతో 240 వరకు మాత్రమే నిర్మించారు. కొన్ని అపార్టుమెంట్లలో స్థలం లేక పోవడం, కొన్ని చోట్ల నిర్మాణాలకు యజమానులు అంగీకరించడం లేదనే సాకుతో అధికారులు చేతులెత్తేశారు. ఈ విధంగా రూ.80 లక్షల నిధులను పక్కనపెట్టినట్లు ఆరోపణలున్నాయి. నిర్మా ణాల్లోనూ లోపాలు కనిపించాయి. ప్రస్తుతం అవన్నీ నిరుప యోగంగా ఉన్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న బోరుకు ఏడాదంతా నీరు అందాలంటే ఇంకుడు గుంతలు తప్పనిసరి అని నిపుణులు సైతం చెబుతున్నారు. 250 గజాల నుంచి 500 గజాల స్థలం ఉన్న ఇంటి ఆవరణలో నాలుగు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు, 9 అడుగుల లోతు ఉండేలా గుంత తీయాలి. దీనికి నలువైపులా అడుగు భాగంలో ఎక్కడా సిమెంటు ప్లాస్టరింగ్ చేయకూడదు. చిన్న స్థలం ఉన్న దగ్గర ఒక మీటరు పొడవు, ఒక మీటరు వెడల్పు, ఒక మీటరు లోతులోనూ నిర్మించొచ్చు. వర్షపునీరు అందులోకి చేరేలా చూసుకోవాలి. ఒక్క వర్షాకాలంలోనే ఓ కుటుంబానికి 3 సంవత్సరాల వరకు సరిపోయే నీటిని సేకరించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయినా ఇంకుడు గుంతల విషయంలో పట్టించుకున్న దాఖలాలు లేవు.

మరో వైపు అపార్ట్మెంట్లలో కనీసం మట్టి కనిపించకుండా మొత్తం ప్లాస్టింగ్ చేయడంతో నీరు కనీసం నిల్వ ఉండే పరిస్థితి లేదు. ఇప్పటికే నగరంలో నీటి ఇబ్బందులు అధికంగా ఉన్నా వీటిపై దష్టి సారించకపోవడం అధికారులు, పాలకుల తీరుకు నిదర్శనం. ఇప్పటికైనా మేలుకోకపోతే భవిష్యత్ లో మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

సంతృప్తికరంగా నాడు-నేడు పనులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక వెంకంపేట వీధి ఎంపియుపి స్కూల్‌లో జరిగిన నాడు-నేడు రెండోవిడత పనులు సంతృప్తికరంగా ఉన్నాయని డిఇఒ జి.పగడాలమ్మ తెలిపారు. పట్టణంలోని వెంకంపేట వీధి ఎంపియుపి స్కూల్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఇక్కడ జరిగిన నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల ఉండడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జి.పరాంకుశము నాయుడు రెండో విడత నాడు-నేడు ప్రగతిని వివరించారు. నిధులు సరిపోక పనులు కొన్ని మిగిలిన పోయాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందిస్తూ నిధులు కేటాయింపునకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆమెతోపాటు ఎంఇఒ-2 సోంబాబు ఉన్నారు.

వీరఘట్టం : పాఠశాలల పున ప్రారంభానికి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిఇఒ జి.పగడాలమ్మ తెలిపారు. మండలంలోని కంబరవలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు. మండలంలోని 24 పాఠశాలల్లో రెండో విడత నాడు నేడు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో 10 కాంపెట్మెంట్స్ పనులను త్వరితగతిగా పూర్తి చేసేందుకు చొరవ చూపాలని ఎంఇఒ-2 ఆర్-ఆనందరావును ఆదేశించారు. అంతకు ముందు వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు.




మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

జిల్లాలో పారిశ్రామిక సంక్షోభం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అసలే విజయనగరం జిల్లా పారిశ్రామికంగా అత్యంత వెనుకబడిన ప్రాంతం. ప్రభుత్వ విధానాలు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి మాట అటుంచితే... ఉన్న ఉద్యోగాలు, ఉపాధి కూడా లేకుండా పోతున్నాయి. దీంతో, ఏటా వేలాది మంది జీవనోపాధి కోసం వలసపోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఈనెల 18న కొత్తవలస పారిశ్రామికవాడలోని జిందాల్ పరిశ్రమ మూత కార్మికవర్గాన్ని మరింత కలవరపెట్టింది. మొత్తం 450మంది కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. ఈ మాటకొస్తే జిల్లాలో అనేక పరిశ్రమలు ఏటా మూతపడుతూనే ఉన్నాయి. ఒకప్పుడు ఫెర్రోఎల్లాయీస్ పరిశ్రమలకు పుట్టినిల్లుగావున్న విజయనగరం జిల్లా నేడు తిరోగమిస్తోంది. జిల్లాలో గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు ఉండేవి. గత ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న యోన, ఇంపెక్స్ గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేచర్ నడుస్తోంది. బొబ్బిలిలోని సిరి ఫెర్రో ఒడిదొడుకుల మధ్య నడుస్తోంది.



ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం. ఫెర్రో క్రోమ్ ఉత్పత్తిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఛార్జీలు పెంచితే అనివార్యంగా వాటి మనుగడ భారమౌతుంది.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్యంగా విజయనగరం జిల్లాలోనూ ఒకప్పుడు జ్యూట్ మిల్లులు ఎక్కువగా ఉండేవి. జనపనార, గోగు (మెస్తా) కలిపి జ్యూట్ ఉత్పత్తులు తయారవుతాయి. ఉత్తరాంధ్ర నేలలు గోగు సాగుకు అనుకూలంగా ఉండడంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా జ్యూట్‌మిల్లులు ఆవిర్భవించాయి. ప్రభుత్వ విధానాల కారణంగా 1990 తరువాత కాలంలో జ్యూట్ ఉత్పత్తుల స్థానంలో ప్లాస్టిక్, మైకా వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, నార కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వంటి కారణాల వల్ల గోగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం జూట్ ఉత్పత్తులపైనా పడింది. దీంతో, ఒకప్పుడున్న తొమ్మిది జ్యూట్ మిల్లులకుగాను ఒకటే నడుస్తోంది. నెల్లిమర్ల జ్యూట్‌మిల్లులో 8ఏళ్ల క్రితం 5వేల మంది నుంచి 6వేల మంది కార్మికులతో కళకళలాడేది. ప్రస్తుతం 1500 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సాలూరు జీగిరాం జ్యూట్ మిల్లు ఎప్పటికప్పుడు లాకౌట్‌కు గురవుతోంది. మిగిలినవన్నీ దాదాపు ఉనికి కోల్పోయాయి. ముఖ్యంగా విజయనగరంలోని అరుణా, ఈస్టుకోస్టు, బొబ్బిలిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస శాశ్వతంగా మూతపడ్డాయి. జిల్లాలో భీమసింగి, లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీలు ఉండడంతో ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా 10,473 హెక్టార్ల మేర చెరకు విస్తీర్ణం ఉండేది. వాటిని ఆధునీకరించకపోవడంతో ప్రస్తుతం 3830 హెక్టార్లకు తగ్గింది. ఆర్థిక సంక్షోభం పేరుతో లచ్చయ్యపేట సుగర్స్, చెరకు విస్తీర్ణం తగ్గిపోయిందనే పేరుతో భీమసింగి ఫ్యాక్టరీ మూసివేయడంతో వేలాది మంది రైతులు, ఇటు కార్మికులు ఉపాధి కోల్పోయారు. పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాలవారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. దీంతో, పారిశ్రామిక రంగంలో జిల్లాకు వస్తున్న ఆదాయం కూడా ఘననీయంగా తగ్గిపోతోంది. ఎన్నికల నేపథ్యంలో నిన్నమొన్నటి వరకు పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగాలు కల్పన పేరిట తెగేసి హామీలు గుప్పించిన నేతలు ప్రస్తుతం పత్తాలేకుండా పోయారు. దీంతో, కార్మికుల జీవనం దినదిన గండంగా మారింది.

జియ్యమ్మవలస: కుదమలో గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డిఎస్‌పి కృష్ణారావు



మార్టిన్‌కు నివాళ్లు అర్పిస్తున్న జెసి శోభిక, అధికారులు

మార్టిన్ మరణం పట్ల కలెక్టర్ సంతాపం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా కలెక్టరు డ్రైవరుగా విధులు నిర్వహిస్తూ శుక్రవారం రాత్రి మృతి చెందిన తాలాడ మార్టిన్ కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మార్టిన్ చిత్ర పటానికి జాయింట్ కలెక్టర్ ఎం ఎస్ శోభిక అధికారులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.మార్టిన్ గత కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉంటూ చికిత్స పొందుతూ మరణించారు. మార్టిన్ మంచి సేవలు అందించారని, వారి సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ అన్నారు. ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నారు.


సీతానగరం మండలం రంగంపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ రవికుమార్

గ్రామాలు ప్రశాంతంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం/కురుపాం

గ్రామాల్లో ప్రశాంత వాతావరణ ఉండాలని సిఐ కె.రవికుమార్ అన్నారు. మండలంలోని రంగంపేట, వెంకటాపురం, వెన్నెల బుచ్చంపేటలో ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వతిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణ ఉండాలని, ఎటువంటి అల్లర్లు, తగాదాల ఉండకూడదని చెప్పారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.రాజేష్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కురుపాం : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు సమాచారం లేకుండా ఎటువంటి ర్యాలీలు నిర్వహించకూడదని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని శివన్నపేట, బియ్యాలవలస గ్రామాల్లో ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఎన్నికల ఫలితాలు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ముందస్తు సమాచారం లేకుండా ఎటువంటి ర్యాలీలు, బాణా సంచాలు, డిజె సౌండ్‌లో వంటివి ఉపయోగించకూడదన్నారు. ప్రజలంతా కూడా ప్రశాంత వాతావరణంలో సోదరా భావంతో ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో మూతపడిన పాఠశాలకు సంబంధించి విద్యార్థులు వివరాల నమోదు చేయాలని డిఇఒ పగడాలమ్మ ఆదేశించినట్టు ఆదేశాలు వచ్చినట్లు స్థానిక ఎంఇఒ- 2 ఆర్.ఆనందరావు శనివారం తెలిపారు. చదువు దూర భారం అన్న శీర్షికన 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. ఈమేరకు పెద్ద గదబవలసలో ఎంతమంది విద్యార్థులున్నారు. ఏఏ తరగతులు చదువుతున్నారు, వాటి జాబితా తయారుచేసి తమకు పంపించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

గురుకులాల్లో విద్యార్థుల సీట్ల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గురుకుల ఆశ్రమ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చేరగోరే విద్యార్థుల సీట్లు సంఖ్య పెంచాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ కోరారు. గురుకుల కళాశాలల్లో ఒక్కొక్క గ్రూపునకు 40 సీట్లు మాత్రమే కేటాయించడంతో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ చదువుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. కళాశాలల్లో 40 నుంచి 60 సీట్లు వరకు పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది కూడా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గణనీయంగా ఉత్తీర్ణత వచ్చిందని, ఇంటర్మీడియట్ చదువుకునేందుకు విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో కలిసి ఐటిడిఎల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యాసదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సీతానగరం

ఈ నెల 27న విజయనగరంలో 'విద్యారంగంలో పరిణామాలు - సవాళ్లు' అనే అంశంపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు సీతానగరం మండలం నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై సదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావులు ప్రకటన విడుదల చేశారు. విజయనగరంలోని కెఎల్‌పురంలోని శేషగిరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఈ సదస్సుకు శాసనమండలి మాజీ ప్రొటెం స్పీకర్ విఠపు బాలసుబ్రమణ్యం, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కేఎస్ ప్రసాద్‌లు హాజరవుతారని ఉపాధ్యాయులంతా హాజరవ్వాలని కోరారు.

తోటపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళశాసన ములు, విశేష హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు వివి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్టు ఇఒ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు, పెడారపు పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మీనా కుటుంబ సభ్యులను పరామర్శించిన జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వీధిలో బతుకు తెరువు కోసం చిన్న టిఫిన్ హోటల్ నడుపుతూ అనారోగ్యంతో మతి చెందిన మీనా అనే మహిళ కుటుంబాన్ని కురుపాం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట టిడిపి నాయకులు గంటా జగం, సొంటేన రాజేష్, మహేశ్వర చిన్న, కొనిస మన్మధరావు, ఎస్.రామారావు తదితరులు ఉన్నారు.


మీనా కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జగదీశ్వరి, టిడిపి నాయకులు

పార్కింగ్ సౌకర్యం లేని పాలకొండ

రోడ్డు పైనే వ్యాపారాలు • వాహనాల నిలిపే స్థలాలు ఆక్రమణ

ప్రజాశక్తి -పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణం విద్య, వ్యాపార, ఆరోగ్య పరంగా చుట్టుపక్కల అనేక మండలాలకు ప్రధాన ముఖద్వారంగా ఉందని చెప్పవచ్చు. దీంతో పాలకొండకు ప్రతిరోజూ రాకపోకలు చేసే వారి సంఖ్య వేలల్లోనే ఉంటుంది. పెరుగుతున్న పట్టణీకరణతో పాలకొండలో షాపులకు కూడా విపరీతమైన గిరాకీ పెరిగింది. షాపుల అద్దెలు కూడా ఆకాశానికి అంటుతుండడంతో రోడ్డు మీద వ్యాపారాలు చేసుకుంటున్నవారి సంఖ్య కూడా ఘననీయంగా పెరిగింది. దీంతో పట్టణంలో పోలీస్ స్టేషన్ నుంచి కార్గిల్ కూడలి వరకు, అలాగే ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఇరువైపులా తోపుడు బళ్లు వల్ల రోడ్డు కుదించుకుపోయి ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. పాలకొండ పట్టణంలో శ్రీకాకుళం, పార్వతీపురం ప్రధాన రహదారితో పాటు దుర్గ గుడి వెనుక నుంచి లుంబూరు రహదారి, మార్కెట్ రహదారి, సీతంపేట రోడ్డు, వడమ కూడలి, గాంధీ బొమ్మ నుంచి పాత పట్టణంలోకి వచ్చే రహదారులు ఇలా కొన్ని ముఖ్యమైన


పాతబస్టాండ్‌లో ఇరుకైన రోడ్డు

రహదారులన్నీ కూడా ట్రాఫిక్ వల్ల సరైన పార్కింగ్ లేకపోవడంతో నిత్యం రద్దీగా ఉంటాయి. గతంలో పాలకొండలో ఆర్‌డిఒగా పని చేసిన సాలూరు వెంకటేశ్వరరావు అప్పట్లోనే పాలకొండ ట్రాఫిక్‌ను అంచనా వేసి అదే సమయంలో సిఐగా పని చేసిన విజయానంద్‌తో కలిసి పట్టణ రూపురేఖలు మార్చడానికి కృషి చేశారు. ఫలితంగా మెయిన్ రోడ్డులో ప్రధాన కాలువ మీద ఉన్న ఆక్రమణలు తొలగించి షాపుల ముందు పార్కింగ్ కోసం స్థలం గుర్తించి మార్కింగ్ చేశారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఒక స్థలం, నాగవంశపు వీధి జంక్షన్ లో ఒక స్థలం, ఆర్‌సిఎం పాఠశాల దగ్గర స్థలాలు గుర్తించి పార్కింగ్ కోసం కేటాయించారు. ప్రజలు కూడా ఖచ్చితంగా అక్కడే తమ వాహనాలు పార్కింగ్ చేసి తమ పనులకు వెళ్లేలా అవగాహన కూడా కల్పించారు. ఒకవేళ హద్దులు మీరితే జరిమానాలు కూడా విధిస్తూ ఒక కొలిక్కి తీసుకొచ్చారు. ఆ అధికారులు ఇద్దరూ బదిలీపై పాలకొండను విడిచిపెట్టిన తర్వాత పట్టణంలో ట్రాఫిక్ యధాస్థితికి వచ్చేసింది. కాలువలు, పార్కింగ్ ప్రదేశాలు ఆక్రమణలతో నిండిపోయాయి. ఫలితంగా పార్కింగ్ స్థలం అంటూ లేక ఎవరికి నచ్చిన విధంగా వారు తమ వాహనాలను రోడ్డుల మీదే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అంతంతమాత్రంగానే వెడల్పుగా ఉన్న రహదారులు మరింత కుదించుకుపోయాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్య, ఆరోగ్య పరంగా చుట్టూ పక్కల ఉన్న బూర్జ, సంతకవిటి, రేగిడి, వీరఘట్టం, సీతంపేట, కొత్తూరు, భామిని తదితర మండలాల ప్రజలు ప్రధాన కేంద్రంగా ఉన్న పాలకొండకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వీరికి పాలకొండ మండల ప్రజలు అదనం. పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు పట్టణంలో ఈ ట్రాఫిక్ చూసి తమ పిల్లలు క్షేమంగా ఇంటికి వచ్చేవరకు ఆందోళన చెందుతూనే ఉంటారని చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు పట్టణాన్ని పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లాభాపేక్ష చూడకుండా పార్కింగ్ ఏర్పాటు చేయాలి

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ పక్కన ఉన్న స్థలాన్ని ప్రయివేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకునే బదులు అదే స్థలంలో ఆటోలు, ద్విచక్రవాహనలు, నాలుగు చక్రాల వాహనాలకు పార్కింగ్ కేటాయించి ఉంటే పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంతైనా తగ్గేది. ఆ దిశగా అధికారులు చొరవ చూపితే బాగుండేది. అలాగే భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్టీసీ కాంప్లెక్స్ విస్తరణకు కూడా ఈ స్థలం అనుకూలంగా ఉండేది. ఇప్పటికైనా గతంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలు, కాలువలపై ఆక్రమణలు తొలగించి ప్రజలకు పార్కింగ్ కోసం అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలు చాలా ఉపశమనం పొందుతారు

సాహిణి అవినాష్ కుమార్,
పాలకొండ.

మార్కెట్ రోడ్డుపై దృష్టిసారించాలి

మార్కెట్ రోడ్డులో ఆక్రమణల వలన నిత్యం రద్దీ ఎక్కువ ఉంటుంది. మాములు రోజుల్లోనే కష్టంగా ఉంటుంది. అలాంటిది పండగ సమయాల్లో అయితే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి. అలాగే మార్కెట్‌లో షాపులకు సరకులు అందించే వాహనాలు సమయపాలన లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు దుర్గ గుడి నుండి నగరపంచాయితీ కార్యాలయం రోడ్డులోకి ప్రవేశించడం వల్ల ఆయా సమయాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఉదయం7 గంటల లోపే ఆయా వాహనాలను అనుమతించాలి. ఇష్టారాజ్యంగా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చే వాహనాలను కట్టడి చేయాలి.

రాజాన చిన్నారావు,
పాలకొండ

దుర్గ గుడి వద్ద బస్సులను ఆపకుండా చూడాలి

పట్టణంలోకి వచ్చి, పోయే ఆర్టీసీ బస్సులను దుర్గ గుడి దగ్గర ఆపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. అదే బస్సులను మళ్లీ కార్గిల్ పాయింట్ దగ్గర కూడా ఆపుతున్నారు. రెండింటికీ మధ్య వంద మీటర్ల దూరం కూడా లేదు. కాబట్టి బస్సులను కార్గిల్ కూడలి దగ్గరే ఆపేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే గతంలో ఉన్న పాత బస్ స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి అక్కడ బస్సుల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దితే ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య ఉండదు.

బాసురు నరేష్ కుమార్,
పాలకొండ

రైతు బజారు స్థలాన్ని ఉపయోగించాలి

శంకుస్థాపనకే పరిమితమైన రైతుబజార్ స్థలాన్ని తాత్కాలికంగా తోపుడు బళ్లకు, పార్కింగ్‌కు ఉపయోగిస్తే మంచిది. దుర్గగుడి వద్ద ప్రధాన రహదారిలో సాయంత్రం వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి రైతు బజారు స్థలంలో కేటాయించాలి. దీనివల్ల నాగవంశపు వీధి కూడలిలో, దుర్గమ్మ ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుంది.

పామోటి శ్రీనివాసరావు,
పాలకొండ.

ఆలోచనా శక్తి పెంపునకు పుస్తకపఠనం దోహదం

ప్రజాశక్తి - పాలకొండ

పిల్లల్లో ఆలోచనా శక్తి పెంపొందేందుకు పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందని మండలంలోని మెట్ట వెంకటాపురం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలమురళీకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మనం ఏ పనిచేసినా ఆలోచనా శక్తి పెరగడానికి పుస్తక పఠనం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కావున పిల్లలు పుస్తక పఠం శ్రద్ధపెంచాలని సూచించారు. డ్రాయింగ్ మాష్టర్ జి.మురళి,ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కేరమ్స్, క్విజ్ పోటీలు

గుమ్మలక్ష్మీపురం : వేసవి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శనివారం క్యారమ్స్ అండ్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పై రెండు పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా స్ఫూర్తి పెంపొందించేలా విద్యార్థుల ఆసక్తి చూపడం సంతోషకరమని గ్రంథాలయ నిర్వహణ అధికారి డి. సుకన్య అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజున బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శిక్షణలో భాగంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు స్టోరీ టెల్లింగ్‌లో భాగంగా శనివారం కందుకూరి వీరేశలింగం పంతులు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు చదివి వినిపించారు. అలాగే క్రీడా పోటీల్లో భాగంగా చదరంగం, క్యారం తదితర ఆటల పోటీలు నిర్వహించినట్టు శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు.


పాలకొండ గ్రంథాయలంలో వేసవి శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

పశువులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పశువుల్లో సంక్రమించే జబ్బవాపు వ్యాధి నియంత్రణకు ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి పేకాపు లక్ష్మణరావు కోరారు. శనివారం ఆయన మండలంలో పలు గ్రామాల్లో పశువులకు జెబ్బవాపు రాకుండా టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా బలిష్టమైన పశువుల్లో 6 నెలల నుంచి మూడేళ్ల పైబడిన పశువుల్లో కనిపిస్తుందని, ఇది ఎక్కువగా వర్షాకాలంలో వస్తుందని అన్నారు. కలుషితమైన నీరు, మేత వల్ల ఈ వ్యాధి వస్తుందని, పశువుల్లో తీవ్రమైన జ్వరం, శ్వాస ఎక్కువ వేగంగా తీసుకోవడం, భుజంపై గానీ తొడపై గానీ వాపులా ఉండే వంటి లక్షణాలు కనపడతాయన్నారు. అలాగే వాపులు ముట్టినప్పుడు వేడిగా ఉంటాయని, ఈ వ్యాధి రాకముందే టీకాలు వేసుకుంటే పశువులకు వ్యాధి సోకకుండా ఉంటుందని తెలిపారు. అలాగే పశువులు కూడా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ జబ్బవాపు వ్యాధి నియంత్రణకు గ్రామాల్లో ఉన్న పశుసంవర్ధక శాఖ సహాయకుల ద్వారా వ్యాధి నిరోధక టీకాలు పశువులకు వేయిస్తున్నట్టు తెలిపారు. జ్వరం, పళ్ల కొరకడం, బిగించుకొని పారడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు తలను గట్టిగా ఆనించి పెట్టడం, శ్వాస కష్టమవడం వంటి లక్షణాలు కనబడతాయన్నారు. ఈ వ్యాధికి చికిత్స చేసే సమయం కూడా ఉండదని, కావున వ్యాధి నిరోధక టీకానే సరైన నియంత్రణ మార్గమని లక్ష్మణరావు సూచించారు.


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

రాజా కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

డిగ్రీ ఫలితాల్లో రాజా కళాశాల విద్యార్థి పొట్నూరు హారిక 9.7 గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ వీరేంద్ర కుమార్ తెలిపారు. హారిక బిఎస్‌సి మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 9.7 పాయింట్లు సాధించింది. హారికను కరస్పాండెంట్ సుజయకృష్ణ రంగారావు, జాయింట్ సెక్రటరీ బదరి, ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని కోడూరు గ్రామంలో శనివారం అమ్మ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు డి.సురేష్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఎస్ఐ ఆర్.జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన యువతను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడం వల్ల సదరు మనిషి ప్రాణాలు కాపాడి, వారి కుటుంబానికి మంచి చేయవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు సాయి కుమార్, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్తలు వి.తిరుపతిరావు, ఫౌండేషన్ కార్యదర్శి కె.సాయి, యువత పాల్గొన్నారు.

గురుకులానికి 10 మంది ఎంపిక

ప్రజాశక్తి - జామి

జామిలోని నెయ్యిలవీధి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. పాఠశాలలోని 13 మంది ప్రవేశ పరీక్ష రాయగా, అందులో 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కన్నమాంబ తెలిపారు. విద్యార్థులు కష్టపడితే మంచి ఫలితాలు సాధిస్తారనడానికి ఇదే నిదర్శనంగా చెప్పొచ్చున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు వాసుదేవరావు, అయ్యప్ప, సుబ్బలక్ష్మి, శోభారాణి అభినందించారు.

కాజ్‌వే నిర్మించరా?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ, బాణాది గ్రామాల మధ్య గల గెడవల్ల వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గెడ్డపై కాజ్‌వే నిర్మిస్తామని గతంలో నాయకులు చెప్పినా అది కార్యరూపం దాల్చలేదు. దీంతో ఐదు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గెడ్డ నుంచి నీరు రోడ్డు మీదుగా ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మనుషులు, పశువులు కూడా ప్రాణాలు పోగొట్టుకున్నారు. బానాది గ్రామానికి చెందిన రైతులు గెడ్డ అవతల ఉన్న కల్లాలకు వెళ్లాలంటే ప్రవాహానికి అవతలికి వెళ్లలేక అవతల ఉన్నవారు, గ్రామానికి చేరుకోలేక రెండు మూడు రోజులు కల్లాల వద్దనే తిండికి కూడా ఇబ్బంది పడి ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో బానాది గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన గొంప వెంకటరావు ఆతవ గ్రామం నుంచి బానాది గ్రామానికి రోడ్డు వేయాలన్నా తపనతో ఉపాధి హామీ నిధులతో ఆతవ గ్రామం నుంచి బానాది మెట్టు భూముల వరకు మెటల్ రోడ్డు వేయించారు. సుమారు ఈ రోడ్డు రెండు కిలోమీటర్ల వరకు ఉంటుంది. మరో అరకిలోమీటర్లు రోడ్డు వేసి కాజ్‌వే నిర్మిస్తే ఐదు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐదు గ్రామాల రాకపోకలకు అంతరాయం

వర్షం పడితే ఈ గెడ్డ నుంచి రోడ్డుపైగా నీరు ఉధృతంగా ప్రవహించిడంతో ఐదు గ్రామాలు సింగరాయి, ఆతవ, బాణాది, ఎం.సింగవరం, బల్లంకి ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడి తీవ్రంగా ఇబ్బందులు పడతారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తే ప్రయాణానికే కాకుండా, రైతులు పండించే వివిధ రకాల పంటలు కూడా వారి కల్లాలకు గ్రామాలకు చేర్చుకోవడానికి వీలు కలుగుతుంది. ఈ విషయం గతంలో టిడిపి, వైసిపికు చెందిన ఎమ్మెల్యేలకు చెప్పినా కనీస స్పందన లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పదవులు చేపట్టిన తర్వాత ఇచ్చిన మాట నిలుపుకోలేని ప్రజాప్రతినిధులు తమకెందుకని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం, కాజ్‌వే నిర్మాణం పనులు పూర్తి చేస్తే ఆనందపురం వెళ్లడానికి సుమారు ఆరు కిలోమీటర్లు ప్రయాణం తగ్గుతుంతనా ప్రభుత్వం ఎందుకు ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసి కాజ్‌వే నిర్మాణం చేపట్టి ఐదు గ్రామాలు ప్రజలు కష్టాలు తొలగే విధంగా ఐదు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాజ్‌వే నిర్మాణంతోనే కష్టాలు తీరేది

బానాది గెడ్డ వద్ద కాజువే నిర్మాణం చేపడితేనే కష్టాలు తీరేది. కాజ్‌వే నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తే బానాది గ్రామ ప్రజలతోపాటు సుమారు 5 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయి. వర్షాకాలంలో రైతులకు కష్టాలు కూడా తగ్గుతాయి. ప్రభుత్వం మానవతా దృక్పథంతో నిధులు మంజూరు చేయించి రాకపోకలకు ఆటంకం లేకుండా తగు చర్యలు తీసుకోవాలి.

గొంప తులసి, ఎంపిటిసి, బానాది

మూడు రైల్వే గేట్లతో అవస్థలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని నాలుగు కిలోమీటర్ల దూరంలోనే మూడు రైల్వేగేట్లు ఉండటం వల్ల ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శనివారం గేట్లు వద్ద ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రైల్వే గేట్లు వల్ల ప్రతిరోజు అటు ప్రయాణికులు ఇటు మూడు రాష్ట్రాలకు వెళ్లే వివిధ వాహనదారులు నానా ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉందని అన్నారు. ఈ మూడు రైల్వే గేట్లు తప్పించడంలో అటు ఎమ్‌పిలు, ఎమ్మెల్యేలు వంటి పాలకుల గాని ఇటు రైల్వే శాఖ అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మన్యం జిల్లాలో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కేవలం కొమరాడ నుండి పార్వతీపురం వరకు 15 కిలోమీటర్ల దూరం ఉంటే ఈ 15 కిలోమీటర్లు దూరంలో కేవలం 4 కిలోమీటర్ల పరిధిలో కొటిపాం, కుమ్మరకుంట, అర్ధం గ్రామాల మధ్య రైల్వే గేట్లు మూడు ఉండటం వల్ల ప్రతిరోజు పార్వతీపురం వెళ్లవలసిన ప్రయాణికులు మూడు రాష్ట్రాలకు వెళుతున్న వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ గేట్లును తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలో విశాఖపట్నం డిఆర్‌ఎంని కూడా కలుస్తామని చెప్పారు.

వీరఘట్టంలో వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శనివారం వర్షం కురిసింది. గత మూడు రోజులుగా ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో వర్షం కురవడంతో ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పొలం దుక్కులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో 2024-25 ప్రవేశాల కోసం జరిగిన పరీక్షల్లో సీట్లు పొందిన విద్యార్థులంతా సంబంధించిన పాఠశాలకు వెళ్లి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకుని సీటు కన్ఫర్మ్ చేసుకోవాలని ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఒక ప్రకటన కోరారు. అలాట్మెంట్ ఆర్డర్‌ను డౌన్లోడ్ చేసుకొని జూన్ 5నుంచి 15వ తేదీ మధ్యలో మీరు ఎంపిక కాబడిన స్కూలుకు వెరిఫికేషన్ కొరకు సంబంధిత ఒరిజినల్ డాక్యుమెంట్లను, ఒక సెట్ జిరాక్స్ కాపీని తీసుకొని వెళ్లాలని, మీ అడ్మిషన్ కన్ఫర్మ్ చేసుకోవాలని సూచించారు. ఒకవేళ జూన్15లోగా సీటును కన్ఫర్మ్ చేసుకోకపోతే మీ సీటును రద్దు చేసి తర్వాత మెరిట్ విద్యార్థికి ఇవ్వబడుతుందని పేర్కొన్నారు.

పుస్తకాలను జాగ్రతగా భద్ర పరచాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి చేరిన 50 శాతం పాఠ్యపుస్తకాలను జాగ్రత్తగా భద్రపరచాలని డిఇఒ ఎం. ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని పూసపాటిరేగ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను పరిశీలించారు. వర్షాలకు గాలులకు గురికాకుండా గదిలో కిటికీలు, వెంటిలేటర్లను క్లోజ్ చేస్తూ భద్రపరచడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మండలం మొత్తం ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు 6,492 మంది విద్యార్థులు ఉండగా దాదాపుగా 50 శాతం పాఠ్యపుస్తకాలు 100 శాతం నోటి పుస్తకాలు మండలానికి వచ్చాయని ఆయన వెల్లడించారు. మిగతా పుస్తకాలు స్కూలు తెరిచేలోపే మండలానికి చేరుకుంటాయన్నారు. స్టాక్ పాయింట్‌కు రోజు వాహనాల ద్వారా పాఠ్య పుస్తకాలు వస్తాయని వాటిని జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. ఆయనతోపాటు మండల విద్యాశాఖ అధికారి రాజ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.


పట్టణంలోని 8వ వార్డులో పూడికలు తీయిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు

పూడిక తీతలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - సాలూరు

రానున్న వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో మురుగు కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా వార్డుల వారీగా పూడికతీత పనులు చేపడుతున్నారు. వర్షాకాలంలో ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాలువల్లో పూడిక తీయడంపై దృష్టి సారించారు. శనివారం 8వ వార్డులో వెంకటేశ్వర స్వామి ఆలయం వీధిలో పూడిక తీత పనులు చేపట్టారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు ఆధ్వర్యాన సిబ్బంది పూడిక తీత పనులు చేశారు. కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు చెప్పారు.